

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## ఛాయాగ్రహణ దర్శకుడు పి. దేవరాజ్

### ( విజయచిత్ర – 1975, ఆగష్టు  సంచిక నుంచీ)




కొందరు జీవితంలో ఏదో చెయ్యాలనుకుంటారు. మరికొందరు ఏమీ అనుకోరు. కాని అనుకోక పోయినా సరే, ఆనవాయితీ వుండడం నుంచి, దారి అటే లాగుతుంది. ప్రసిద్ధ ఛాయాగ్రాహకుడు దేవరాజ్ కు అదే జరిగింది. దేవరాజ్ తండ్రి గారు పి. శ్రీధర్ నాటి రోజుల్లో సుప్రసిద్ధుడైన ఛాయాగ్రాహకుడు. స్వప్నసుందరి, మాయారంభ, మాయలమారి, శ్రీలక్ష్మమ్మకథ మున్నగు చిత్రాలను అద్భుతంగా చిత్రించిన పేరు గలవారు. కాని దేవరాజ్ కు ఆ ఉత్సాహం మొదట్నుంచీ లేదు. దేశాలు తిరగాలని, వూళ్ళు ఏలాలనీ అతను ఉద్దేశించాడు. మద్రాసులోనే పుట్టి, పెరిగి, ఇక్కడే చదువు పూర్తి చేసిన తర్వాత అతని ఆశలకు ఒక దారి కనిపించింది. 'షిప్' లో జేరాడు. కలకత్తా నుంచి మద్రాసు; మద్రాసు నుంచి కలకత్తా వెళ్ళే 'షిప్' లో అతని ఉద్యోగం. కొంతకాలం అది బాగానే వున్నట్టు అనిపించింది. మరి కొంతకాలం కాగానే, దాని మీద విరక్తి కలిగింది. ఎప్పుడు చూసినా ఒంటరిగా నీటి మీద ప్రయాణం. తల్లిదండ్రుల్నీ స్నేహితుల్నీ చూడాలంటే, కష్టం. ఏదో జైలు జీవితంలా వున్నట్టుంది గాని, తను ఆశించినట్టుగా 'ఊళ్ళు తిరుగుతూ హాయిగా' లేదు; రాజీనామా చేసి, వచ్చేశాడు. తర్వాత ఏం చెయ్యాలి? తండ్రి గారిలా కెమెరా పని నేర్చుకుంటే? అతనికి ఉత్సాహం లేదు. అలా ఆలోచించి, ఆలోచించి సరే కానిమ్మని చేరాడు. చేరిన తర్వాత అతనికి అందులో ఉత్సాహం కనిపించింది.

1961 లో ప్రసాద్ ప్రొడక్షన్స్ వారి 'అవుట్ డోర్ యూనిట్' లో చేరాడు. రెండేళ్ళలోనే అతనికి 'కెమెరా' విషయం అవగాహనమయింది.

తర్వాత ప్రసాద్ వారు అతన్ని తమ 'స్పెషల్ ఎఫెక్ట్' సు శాఖకు మార్చారు. ఆ పనిమీద అతను బొంబాయి వెళ్ళి కొంతకాలం వున్నాడు. ఛాయాగ్రాహణంలో అతనికి వున్న ఉత్సాహం ఇందులో కనిపించలేదు. బొంబాయి నుంచి మద్రాసు వచ్చేసి , రాజలక్ష్మి వారి కెమెరా యూనిట్ లో చేరాడు. అప్పుడు 'గూఢాచారి 116' పూర్తి అవుతున్నది. రవికాంత్ నగాయిచ్ శిష్యరికంలో 'ఫర్జ్' చిత్రానికి పనిచేశాడు. తర్వాత 'మహాబలుడు' కు చేశాడు. రవికాంత్ ఆ చిత్రానికి దర్శకుడు కావడం వల్ల, చాయాగ్రహణానికి సంబంధించిన పన్లన్నీ దాదాపుగా – సహాయకులైన దేవరాజ్, కృష్ణలకే అప్పజెప్పారు. ఆ టైమ్ లో అతనికి మంచి అనుభవం కలిగింది.

అంతే! ఆ అనుభవంతోనే అతను హీరో కృష్ణ ద్వారా 'మాస్టర్ కిలాడీ' చిత్రానికి ఛాయాగ్రాహకుడయ్యాడు ! అది అతని తొలి చిత్రం. తర్వాత రివాల్వర్ రాణి, రౌడీలకు రౌడీలు, జేమ్స్ బాండ్ 777, పసివాని పగ, పంజరంలో పసిపాప, రాజ్యంలో రాబందులు, అభిమానవతి మొదలైన తెలుపు – నలుపు చిత్రాలకు పనిచేశాడు.

అతనికి వర్ణచిత్రం తీసే తొలి అవకాశాన్ని వై. వి. రావు కల్పించారు. ఆ చిత్రం – 'మొనగాడొస్తున్నాడు జాగ్రత్త!' తర్వాత పిల్లా ? పిడుగా?, రాణి అవుర్ జానీ (హిందీ), నాకూ స్వతంత్రం వచ్చింది వర్ణ చిత్రాలకు పని చేశాడు. వై. వి. రావు నిర్మించిన 'ఒకనారి వంద తుపాకులు' చిత్రంలో కొంత భాగం 'సినిమా స్కోప్' లో వున్నది. ఆ చిత్రం ద్వారా అతనికి ఆ అవకాశం కూడా కలిగింది.

"తెలుగులో తొలిసారిగా 'సినిమా స్కోప్' లో షూట్ చేసే అవకాశాన్ని పొందగలిగాను. అందుకు వై. వి. రావు గారే కారకులు" అంటారు దేవరాజ్.

కొంతకాలం క్రితం దేవరాజ్ సొంతంగా చిన్న చిత్రం తియ్యాలని, మూడు నెలల్లో పూర్తి చెయ్యాలనీ పథకం వేశారు – కొత్త దర్శకుడితో, కొత్త వాళ్ళతో. కాని అది రెండేళ్ళయిపోయింది; కొత్త వాళ్ళు అనుకుంటే, పెద్దవాళ్ళతోనే తియ్యవలసి వచ్చింది. అప్పుడు ఆ చిత్రానికి 'మట్టి మనుషులు' అని పేరు పెట్టారు; ఇప్పుడు దాన్నే 'పెద్దింటి కోడలు' అని మార్చారు.

"నిర్మాణ వ్యవహారాలలో పడి, చాలా ఇబ్బందుల్లో పడ్డాను. కాని, నిర్మాత జి. వి. యస్. రాజుగారు, వెంకట్రాజుగారు, సుబ్బారావు గారు, వేణి మూవీస్ శ్రీనివాసరావుగారు మొదలైన మిత్రులు నాకు ఆసరాగా నిలబడి, చిత్రాన్ని పూర్తి చెయ్యడానికి తోడ్పడ్డారు. వారికి ఎప్పటికీ నేను కృతజ్ఞుడైన వుంటాను. త్వరలోనే ఈ చిత్రం విడుదల కాబోతున్నది." అన్నారు దేవరాజ్.

" 'నాకూ స్వతంత్రం వచ్చింది' వర్ణ చిత్రం నాకు నచ్చిన చిత్రం. పనితనం చూపడానికి అవకాశం ఇచ్చిన చిత్రం. నాకు కావలసిన సదుపాయాలు ఇచ్చి, కొంతవరకూ నా అభిరుచి మేరకు తియ్యడానికి ప్రోత్సహించారు దర్శక నిర్మాతలు శ్రీ లక్ష్మీదీపక్, శ్రీ ప్రభాకరరెడ్డి. ఈ చిత్రంలో కొంతవరకూ సహజ వాతావరణాన్ని, వాస్తవికతనూ చూపించడానికి కృషి చేశాము.

"నిజం చెప్పాలంటే, సహజ వాతావరణం, వాస్తవికతలు 'కలర్' లో వచ్చినంత చక్కగా 'తెలుపు నలుపు' చిత్రాల్లో రావు. రంగుల్లో ఆ సౌకర్యాలున్నాయి. పైగా నా దృష్టిలో కలరే తేలిక, బ్లాక్ అండ్ వైట్ కంటె. ప్రతిది 'మోల్డ్' చేసుకోవలసిన అవసరం లేదు. అందంగా, హాయిగా, వాస్తవికంగా ఎలా కావాలంటే అలా, కలర్ లో చూపవచ్చును. అందుకే నేను కలర్ ఛాయాగ్రాహణం అంటే ఎక్కువగా ఇష్టపడతాను." అన్నారు దేవరాజ్.

"అప్పట్లో నేను కె. యస్. ఆర్. దాసు గారితో ఎక్కువగా క్రైమ్ చిత్రాలకు పనిచెయ్యడం వల్ల, నన్ను 'క్రైమ్ ఫోటోగ్రాఫర్' అనేవారు – నేనే క్రైమూ చెయ్యకపోయినా, కాని, నాకు కొత్త తరహాగా వుండే సాంఘిక చిత్రాలకు పనిచెయ్యడం అంటే చాలా ఇష్టం. ఉన్నది ఉన్నట్టుగా తియ్యాలని అభిలాష. అలాంటి అవకాశం వస్తే ఎంతైనా చెయ్యాలనీ వున్నది; చెయ్యకలననీ వున్నది." అంటారు దేవరాజ్.

"నిజానికి క్రైమ్ చిత్రాలు నాకు మంచి పేరు తెచ్చాయి. ఆ చిత్రాలకు నేను ఎప్పుడూ కృతజ్ఞుడినే. కాని అవే ఎప్పుడూ అయితే ఉత్సాహం తగ్గుతుంది. అంటే ఆ చిత్రాలకు పనిచెయ్యనని కాదు; అవీ చేస్తాను. కాని, అందరూ 'వెరైటీ' కోరుకున్నట్టే ఛాయాగ్రాహకుడు కూడా 'వెరైటీ' కోరుకోడంలో తప్పులేదనుకుంటాను.

క్రైమ్ చిత్రాలు తియ్యడంలో చాలా ఇబ్బందులున్నాయి. ప్రతి క్షణమూ అక్కడ గండమే. ఎక్కడో కెమెరా పెట్టాలి; త్రిల్లింగ్ గా తియ్యాలి. గుర్రాలుంటే అవి తంతాయి; రివాల్వర్ లు వుంటే బులెట్లు తగుల్తాయి. కొండ అంచుల మీద, ఇంటి కప్పుల మీదా కెమెరాతో పరుగెత్తాలి. దానికి కొంత తెగింపు, సాహసం కూడా అవసరమే. అందుకనే పేరు రావడం కూడా అలాగే వస్తుంది." అంటారు ఆయన.

తెలుగులో ఇకమీదట వర్ణచిత్రాలకే ఎక్కువ అవకాశం వుందని దేవరాజ్ నమ్మకం. "కన్నడం; మలయాళ భాషలవారే ఎక్కువగా వర్ణచిత్రాలు తియ్యగలుగుతున్నారు. ప్రజలు వర్ణచిత్రాలు చూడ్డానికే అలవాటుపడ్డారు; అంచేత, ముందు ముందు అవే ఎక్కువగా వస్తాయి" అంటారాయన.

దేవరాజ్ వాళ్ళది – 'ఛాయాగ్రహణ వంశం' తండ్రిగారి పోలిక దేవరాజ్ కు వచ్చినట్టే, దేవరాజ్ తమ్ముళ్ళు కూడా ఆ శాఖలోనే పనిచేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే వాళ్లు కూడా ఛాయాగ్రాహకులుగా కనిపిస్తే అందులో ఆశ్చర్యం ఏమీ వుండదు!

వై. వి. రావు త్వరలో ఆరంభించబోతున్న వర్ణచిత్రానికి ('రోటీ' ఆధారంగా) దేవరాజ్ పనిచెయ్యబోతున్నారు. "తొలిసారిగా, యన్. టి. రామారావుగారితో పని చెయ్యబోతున్నాను. వారు ఆశీర్వదించారు" అన్నారు దేవరాజ్ తృప్తిగా.

COMMENTS